క్లుప్తంగా

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఒంగోలు సిటీ: జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన ఈ నెల 22వ తేదీ ఉదయం 10.30 గంటలకు స్థానిక పాత జెడ్పీ సమావేశ మందిరంలో జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ చిరంజీవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులంతా తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. అజెండా అంశాలైన జిల్లా నీటి యాజమాన్య సంస్థ, డీఆర్‌డీఏ, గృహనిర్మాణశాఖ, విద్యాశాఖ, విద్యుత్ శాఖ, వైద్యారోగ్యశాఖ, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖల కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ వివరించారు.

యువకుడు అదృశ్యంపై కేసు నమోదు

కొత్తపట్నం: చికెన్ షాపు తెరుస్తానని చెప్పి వెళ్లిన యువకుడు అదృశ్యం కావడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపట్నం గ్రామానికి చెందిన షేక్ హిజహద్ చికెన్ అమ్ముతూ జీవిస్తున్నాడు. రోజు మాదిరే ఈ నెల 20వ తేదీ చికెన్ షాపు తెరుస్తానని చెప్పి ఇంటి నుంచి బయలు దేరాడు. సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో షాపు దగ్గరకు వెళ్లి చూడగా, మూసివేసి ఉంది. బంధువుల ఇళ్లకు ఫోన్ చేసినా ఆచూకీ లేకపోవడంతో అతని భార్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసింది. ఆ మేరకు ఎస్సై సుధాకర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గిరిజనులకు ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: డీఈడీ, టెట్ పాసైన గిరిజన అభ్యర్థులకు మెరిట్ ఆధారంగా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి పీ జగన్నాథరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి సదుపాయాలను గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రెసిడెన్షియల్ పద్ధతిలో కల్పించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల గిరిజన అభ్యర్థులు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీఈడీ/డీఈడీ, టెట్ పాస్ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, రేషన్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో జ్ఞాన భూమి పోర్టల్‌లో ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జిల్లాలోని కోర్టులకు ఏసీలు

ఒంగోలు: జిల్లాలోని కోర్టు హాళ్లలో ఏసీలు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలోని అన్ని కోర్టులకు కలిపి 203 ఏసీలు మంజూరవగా, తొలి విడతలో 50 ఏసీలు రాగా, పలు కోర్టుల్లో ఇప్పటికే ఏర్పాటు చేశారు. తాజాగా మరో 80 ఏసీలు జిల్లాకు చేరుకున్నాయి. వాటిలో 30 ఏసీలను జిల్లా కేంద్రంలోని ఒంగోలులో కోర్టులకు మంజూరు చేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థతో పాటు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు అవసరాన్ని బట్టి మూడు నుంచి నాలుగు ఏసీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. చీరాల, అద్దంకి, తదితర తాలూకా కోర్టులకు మరో 50 ఏసీలు చేరుకున్నాయి. ఇకపై ఏసీలతో కోర్టు హాళ్లన్నీ చల్లగా మారనున్నాయి.


విద్యుత్ చార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి హనీఫ్

చీమకుర్తి: డిస్కంల ప్రతిపాదనలలో పెంచిన విద్యుత్ చార్జీల భారం రూ.8,114 కోట్లను ప్రభుత్వమే భరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి హనీఫ్, సీపీఎం జిల్లా, మండల నాయకులు పమిడి వెంకట్రావు, పూసపాటి వెంకట్రావు డిమాండ్ చేశారు. సోమవారం చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన మండల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందు టీడీపీ ఇచ్చిన హామీలలో విద్యుత్ చార్జీలను పెంచబోమని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ప్రజలపై మోయలేని భారానికి కారణమవుతున్న ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి



ధర్నా చేస్తున్న మున్సిపల్ వర్కర్లు

చీమకుర్తి: మున్సిపల్ కార్మికులపై రాజకీయ కక్ష సాధింపులు మానుకోవాలని, సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మార్కాపురం ఇంజినీరింగ్ కార్మికులను, గిద్దలూరు కోవిడ్ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం మున్సిపల్ వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. వారికి మద్దతుగా సీఐటీయూ నాయకులు పాల్గొని మాట్లాడారు.

ముందు చూపు నై.. అవినీతికి సై..!



నవోదయ స్కూలు రోడ్డులో తవ్వి వదిలేసిన కల్వర్టు



మినీస్టేడియం పక్కన కల్వర్టుపై ఉన్న రాళ్లు తొలగించిన దృశ్యం

- వర్షాల హెచ్చరికలు ఉన్నా.. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టని నగరపాలక సంస్థ అధికారులు
- వర్షాలు కురిసి భారీగా నీళ్లు నిలిచాక.. తాత్కాలిక పనుల పేరుతో రూ.లక్షలు కాజేస్తున్న వైనం
- వర్షం కురిసినప్పుడల్లా ఇదే తంతు
- అధికారుల నిర్లక్ష్యం, అవినీతి కారణంగా నగర వాసులకు అవస్థలు
- వర్షాలు తగ్గినా తీరని కష్టాలు

ఒంగోలు సబర్బన్:

దాహం వేసినప్పుడు బావి తవ్వుకున్నట్లుంది ఒంగోలు నగరపాలక సంస్థ అధికారుల పనితీరు. వర్షాలకు నగరంలో నీళ్లు నిలవకుండా ఉండేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించి శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. భారీ వర్షాలు కురుస్తాయంటూ వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నప్పటికీ నిమ్మకునీరెత్తినట్లు ఉంటున్నారు. తీరా వర్షం కురిసి నగరంలోని లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు, కాలనీల్లో సైతం భారీగా నీళ్లు నిలిచాక అప్పటికప్పుడు తాత్కాలిక పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. ఆయా పనులను అత్యవసర పనులుగా చూపించి బిల్లుల పేరుతో లక్షల రూపాయలు కాజేస్తున్నారు. హడావిడిగా జేసీబీలు, పొక్లెయిన్లు పెట్టడం, వరద ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర పనుల కింద ప్రజల సొమ్మును దోచేయడమే పనిగా నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం అధికారులు వ్యవహరిస్తున్నారు. వర్షం కురిసినప్పుడల్లా ఇలా చేయడం మినహా సమస్యను శాశ్వతంగా పరిష్కరిద్దామన్న ఆలోచనే అధికారులకు లేకుండా పోయింది. దీనిపై ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కూడా స్పందించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించడంగానీ, సమస్య పరిష్కారంపై దృష్టి సారించడంగానీ లేకపోవడంపై నగరవాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నగరంలో పరిస్థితి అధ్వానంగా మారిందంటూ ఆగ్రహిస్తున్నారు.

చిన్నపాటి వర్షానికే నగరం జలమయం...

ఒంగోలు నగరం చిన్నపాటి వర్షానికే జలమయమవుతోంది. కాలువలన్నీ పొంగిపొర్లి రోడ్లపై వర్షం నీరు నిలిచి రోజుల తరబడి ఉంటూ వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మారుతోంది. ఇక, భారీ వర్షాలు, అతి భారీ వర్షాలు కురిస్తే ప్రజల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. పలు ప్రధాన రోడ్లు, కాలనీలు, లోతట్టు ప్రాంతాల్లో మోకాలి లోతు నీరు చేరుతోంది. నగరంలోని ప్రధాన కాలనీ అయిన భాగ్యనగర్‌లోని నాలుగో లైన్ దుస్థితి గురించి మాటల్లో చెప్పలేం. ఈ రోడ్డు ముఖ ద్వారమైన నాలుగో తరగతి ఉద్యోగుల కాంప్లెక్స్ మొదలుకుని హౌసింగ్ బోర్డు వరకు వాహనాలు తిరగలేని పరిస్థితి. పాదచారులైతే అడుగుతీసి అడుగు వేయలేరు. ఎక్కడబడితే అక్కడ ఏడాది పొడవునా మంచినీటి పైపులైన్ల కోసం ఈ రోడ్డును తవ్వుతూనే ఉంటారు. దాంతో ఆ రోడ్డులో ప్రయాణం అంటే నరకానికి రహదారి వేసుకున్నట్లే. ఇక నవోదయ స్కూలుకు వెళ్లే రోడ్డు ముఖద్వారంలో ఉన్న కల్వర్టును పగులగొట్టారు. దాంతో అటు ఇరిగేషన్ కార్యాలయాలకు వెళ్లే అధికారులు, సిబ్బంది, గిరిజన హాస్టల్‌కు వెళ్లే విద్యార్థులు, మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేవారికి తీవ్ర అసౌకర్యంగా ఉంది.

ప్రధాన కూడలి మస్తాన్‌దర్గా వద్ద సైతం...

ఒంగోలు నగరంలోని మస్తాన్‌దర్గా సెంటర్ అత్యంత ప్రధాన కూడలి. అక్కడ పరిస్థితిని గమనిస్తే.. వర్షం కురిస్తే ద్విచక్ర వాహనాలు వెళ్లలేవు. మురుగు కాలువలు సక్రమంగా లేకపోవడంతో వర్షాలకు ఈ రోడ్డు మూడడుగుల లోతున మునిగిపోతుంది. చివరకు షాపుల్లోకి కూడా నీళ్లు చేరుతున్నాయి. దాంతో పాటు పాత కూరగాయల మార్కెట్ వద్ద గల మెయిన్ రోడ్డుపై వర్షం నీరు తానందం ఆడుతోంది. ప్రస్తుతం అక్కడున్న ప్రధాన కాలువకు మిషన్లతో మరికొన్ని రంధ్రాలు వేసి మరీ నీటిని బయటకు పంపుతున్నారు. వర్షానికి మస్తాన్‌దర్గా సెంటర్ దగ్గర నీరు భారీగా నిలిచిపోతూ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కొత్తపట్నం బస్టాండ్ ప్రాంతం, కమ్మపాలెం వెళ్లే రోడ్డులో పరిస్థితి కూడా అత్యంత దారుణంగా ఉంటోంది.



భాగ్యనగర్ 4వ లైన్ రెండో క్రాస్ రోడ్డు పక్కన ఇళ్ల ముందు నిలిచిన మురుగునీరు



ఛిద్రమైన హౌసింగ్ బోర్డు రోడ్డు

నగరం గురించి ఏమాత్రం పట్టించుకోని ఎంపీ మాగుంట...

ఎమ్మెల్యే జనార్దన్‌తో పాటు ఎంపీ మాగుంట సైతం వర్షాలకు మునుగుతున్న ఒంగోలు నగరం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. నగరంలో ఎగువ భాగాన పడిన వర్షం నీరు అగ్రహారం రైల్వే గేటుకు ఇరువైపులా, రామ్‌నగర్ ఒకటి నుంచి పదో లైన్ వరకు ఉన్న రైల్వే లైన్ల కింద గల కల్వర్టుల ద్వారా తూర్పునకు వెళ్లాల్సి ఉంది. కానీ, అన్ని కల్వర్టులు మూసుకుపోవటంతో పాటు రైల్వే అండర్ బ్రిడ్జి పనులు ఇంత వరకు ప్రారంభం కాకపోవడంతో మురుగు బయటకు వెళ్లే మార్గం లేకుండాపోయింది. ఫలితంగా నగరవాసులు నానా అవస్థలు పడుతున్నారు. రైల్వే పరిధిలో ఉన్న ఈ సమస్య గురించి ఇప్పటి వరకు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పట్టించుకోలేదు. కనీసం మురుగునీరు కూడా వెళ్లే వీలు లేకపోవడంతో నగరపాలక సంస్థ అధికారులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. అప్పుడుగానీ ఎంపీ మాగుంటలో చలనం రాలేదు. రైల్వే అండర్ బ్రిడ్జి విషయమై రైల్వే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సరిపెట్టుకున్నారు.

ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం



నాగులుప్పలపాడు : పోలీసు అమరవీరుల ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది



మద్దిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై శివరామయ్య, పోలీసు సిబ్బంది



చీమకుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ సుబ్బారావు, పోలీసులు, విద్యార్థులు



కొత్తపట్నంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్న మెరైన్ పోలీసులు

మద్దిపాడు: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని మద్దిపాడు ఎస్సై శివరామయ్య ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, పోలీసు సిబ్బంది మద్దిపాడులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం అశువులు బాసిన పోలీసు అమరవీరులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రమేష్‌కృష్ణ, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి...

నాగులుప్పలపాడు: సమాజంలో భద్రత, రక్షణ వంటి రంగాల్లో పోలీసులు చూపించే తెగువ, వారి త్యాగాలు వెలకట్టలేనివని నాగులుప్పలపాడు ఎస్సై శ్రీకాంత్ అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం నాగులుప్పలపాడులో ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో పోలీసులకు ఉండే ఒత్తిళ్లు, భద్రత వంటి అంశాలపై విద్యార్థులు, ప్రజానీకానికి తెలియజేశారు. ముందుగా పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: పోలీసు అమరవీరుల త్యాగాలు చాలా గొప్పవని సీఐ ఎం.సుబ్బారావు అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా సోమవారం చీమకుర్తి పట్టణంలోని పోలీసులు విద్యార్థులతో కలిసి మెయిన్‌రోడ్డుపై ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు పోగొట్టుకున్న పోలీసులకు నివాళులర్పించారు.

కొత్తపట్నంలో...

కొత్తపట్నం: స్థానిక కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్, బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేతాజీ ట్రూప్ విద్యార్థులు పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవం సందర్భంగా సోమవారం కొత్తపట్నంలో నివాళులర్పించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేతాజీ ట్రూప్ విద్యార్థులచే హైస్కూల్ నుంచి బస్టాండ్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మెరైన్ సీఐ ఎస్.సాంబశివరావు మాట్లాడుతూ అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ వారి బాటలో నడవాలని కోరారు. ఇటీవల బీచ్‌లో బాషా అనే వ్యక్తి ప్రాణాలు కాపాడిన హెచ్‌జీ ఎస్.శ్రీను, ప్రైవేట్ ఈతగాళ్లకు జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో ఎస్సై సుధాకర్‌బాబు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ కమిషనర్ కొణిజేటి వెంకటశేషారావు, మెరైన్ ఎస్సై పి.సుబ్బారావు, ఎస్సై రాజేష్, హెడ్‌కానిస్టేబుల్ పాండురంగారావు, రైటర్ వి.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నిర్మూలనకు అందరి సహకారం అవసరం

నాగులుప్పలపాడు: హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు, మాదక ద్రవ్యాల రవాణా నిర్మూలనకు అందరి సహకారం అవసరమని ఎంఈవో రవి అన్నారు. బాపట్ల, ప్రకాశం ఉమ్మడి జిల్లాల హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ, నిర్మూలన సంస్థలు, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నాగులుప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సాగర్ ఆధ్వర్యంలో మీకు తెలుసా అనే పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా సుఖ వ్యాధుల నిర్మూలన, ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో యువతీ, యువకులను, ప్రజలను చైతన్యపరచాల్సిన బాధ్యత సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రతిఒక్కరిపై ఉందన్నారు. సాగర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిని 2030 నాటికి రాష్ట్రంలో, దేశంలో లేకుండా చేయాలనే నిశ్చయంతో అందరం కలిసి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో రమణయ్య, మల్లీశ్వరి, నాగదివ్య, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

జనవరి 18 నుంచి ఎన్టీఆర్ కళాపరిషత్

ఒంగోలు మెట్రో: ఎన్టీఆర్ కళాపరిషత్ జాతీయ స్థాయి నాటకోత్సవాలను 2025 జనవరి 18 నుంచి 31వ తేదీ వరకు గతంలోకన్నా మిన్నగా నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు ఈదర హరిబాబు తెలిపారు. అన్ని రాష్ట్రాలు, అన్ని భాషల నాటక కళాసంస్థలకు ఆహ్వానం పత్రాలు అందించినట్లు వెల్లడించారు. స్థానిక మౌర్య హోటల్లో సోమవారం ఎన్టీఆర్ కళాపరిషత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ అన్ని విభాగాల నాటకాలకు అవకాశం కలిగేలా జాతీయ స్థాయి నాటకోత్సవాలకు పద్య, గద్య, సంగీత, నృత్య, చారిత్రాత్మక, సామాజిక, పౌరాణిక, ప్రయోగాత్మక, జానపద, కల్పిత, ముఖాభినయం, హాస్య, బాల, యువ, మహిళా, స్టేజి, ఎరీనా, వీధి, ఇలా వివిధ విభాగాలను, వివిధ కాల పరిమితులలో ప్రదర్శనలకు అన్ని భాషల కళా సంస్థలకు ఆహ్వానం పలుకుతున్నట్లు చెప్పారు. అన్ని విభాగాల నాటకాలకు గౌరవ పారితోషికం ఇస్తామన్నారు. కళాసంస్థలు నవంబర్ 30వ తేదీలోపు దరఖాస్తులు పంపాలని కోరారు. ఈ సంవత్సరం నుంచి వీడియో స్క్రూటినీ ద్వారానే నాటక కళారూపాలను ఎంపిక చేస్తారని, అప్లికేషన్ ఫీజు కట్టనవసరం లేదని తెలిపారు. స్క్రూటినీలో ఎంపికైన కళారూపాల సమాచారాన్ని ఆయా సంస్థలకు డిసెంబర్ 15 లోగా తెలియజేస్తామని తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న ఎన్టీఆర్ కళాపరిషత్ నిర్వాహకులు

క్షణికావేశంలో విలువైన జీవితానికి ఇబ్బందులు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ఒంగోలు: క్షణికావేశంలో చేసే తప్పులు విలువైన జీవితానికి ఇబ్బందులు తెచ్చిపెడతాయని, క్షణికావేశం వీడి మంచి మార్గాన్ని ఎంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి ఖైదీలకు సూచించారు. సోమవారం స్థానిక జిల్లా జైలును సందర్శించి ఖైదీలకు అందుతున్న ఆహారంలో నాణ్యతను పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలు, వారికి చట్ట ప్రకారం అందాల్సిన సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ న్యాయవాదిని నియమించుకోలేని ఖైదీలకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ సిస్టం ద్వారా ఉచితంగా న్యాయవాదిని నియమించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఖైదీ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు, జిల్లా జైలు అధికారులు వి.రమేష్, ఎం.శ్రీనివాసరావు, జైలు వైద్యులు బ్రహ్మతేజ, జైలు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ఆహారాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వర్షం నీరు మళ్లింపు

ఒంగోలు సిటీ: ఇటీవల కురిసిన వర్షాలకు పేర్నారు కాలనీలోని ఆంధ్రకేసరి యూనివర్సిటీ ప్రాంగణం నీటితో నిండిపోయింది. వర్షం నీటిని బయటకు పంపేందుకు ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టరు మండే హర్షప్రీతందేవ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సోమవారం శ్రమదానం చేశారు. పలుగు, పారతో కాలువ తీసి నీటిని బయటకు మళ్లించారు.



వర్షం నీటిని బయటకు పంపుతున్న వలంటీర్లు

రైలు పట్టాలు దాటే వేళ జాగ్రత్తగా ఉండాలి



విద్యార్థులకు రైల్వే చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రవి

ఒంగోలు సిటీ: విద్యార్థులు రైలు పట్టాలు దాటే సమయంలో ఇరువైపులా జాగ్రత్తగా గమనించిన తర్వాతే దాటాలని రైల్వే ఆర్పీఎఫ్ ఎస్సై రవి సూచించారు. సోమవారం స్థానిక బాలాజీనగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు రైల్వే చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రవి మాట్లాడుతూ రైళ్లపై రాళ్ల దాడి, దాని శిక్షలు, అతిక్రమణ సంఘటనలు, పరిణామాల గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. 139, 1098 టోల్ ఫ్రీ నంబర్ల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై శ్రావణ్, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఉపాధి కల్పించడమే లక్ష్యం



దంపతులకు తోపుడుబండి అందిస్తున్న సర్దార్‌బాషా

ఒంగోలు సిటీ: నిరుపేదలకు ఉపాధి కల్పించడమే సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని ట్రస్ట్ కార్యదర్శి సర్దార్‌బాషా అన్నారు. సోమవారం ఒంగోలులోని వెంకటేశ్వరకాలనీకి చెందిన యరమల అంజమ్మ, హనుమయ్య దంపతులకు ట్రస్ట్ ద్వారా తోపుడుబండి అందించి పండ్ల వ్యాపారం పెట్టించి ఉపాధి కల్పించారు. వారి కుమారుడు యాక్సిడెంట్‌లో చనిపోవడం వలన అనాథలయ్యారని, అంజమ్మ గుండె వ్యాధితో బాధపడుతోందని, భర్త అనారోగ్యంతో ఉన్నారని సర్దార్‌బాషా తెలిపారు. వారిద్దరూ వేరేపని చేయలేకపోతున్నారని, అందువలన తమ ట్రస్ట్ ద్వారా వారికి ఉపాధి కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

నవంబర్ 17న కాపు వనభోజన మహోత్సవం



మాట్లాడుతున్న సంజీవ్‌కుమార్

ఒంగోలు వన్‌టౌన్: కాపు వనభోజన మహోత్సవాన్ని నవంబర్ 17వ తేదీ నిర్వహించనున్నట్లు కాపు సంఘ జిల్లా అధ్యక్షుడు కె.సంజీవ్‌కుమార్ తెలిపారు. స్థానిక కాపు సంఘ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కాపు సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒంగోలు దక్షిణ బైపాస్‌లోని కార్గిల్ పెట్రోల్ బంకు వద్ద ఉన్న డీ6 ఫంక్షన్ హాలులో కాపు వనభోజన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కాపులంతా పాల్గొనాలన్నారు. సమావేశంలో కాపు సంఘ నాయకులు టి.శ్రీనివాసమూర్తి, యు.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, రామ్‌రాజ్‌కుమార్, ఎం.వెంకటేశ్వర్లు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు చెస్, యోగా, సైక్లింగ్ ఎస్‌జీఎఫ్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: చదరంగం, యోగా జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాకారులను మంగళవారం స్థానిక పర్వతరెడ్డి ఆనంద్ మినీ స్టేడియంలో ఎంపిక చేయనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి హాజీరాబేగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైక్లింగ్ క్రీడాకారుల ఎంపిక కనిగిరి మండలం గురవాజీపేట ఉన్నత పాఠశాలలో ఉంటుందన్నారు. అండర్ 14, అండర్ 17 విభాగాలలో ఎంపిక ఉంటుందన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఔత్సాహిక బాలబాలికలను సిద్ధం చేసి ధ్రువీకరణ పత్రాలతో ఎంపిక పోటీలకు పంపించాలని సూచించారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

250 మందికి అన్నదానం

సంతనూతలపాడు: స్థానిక బస్టాండ్ సెంటర్లో సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయ ఆవరణలో సోమవారం 18వ సారి ట్రస్టు ఆధ్వర్యంలో 250 మందికి అన్నదానం చేశారు. రిటైర్డ్ ఎంపీడీవో పాశం బ్రహ్మయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు జాలమ్మ, శ్రీనివాసరావు, రాజరాజేశ్వరి, జ్యోతి ఈ కార్యక్రమం నిర్వహించారు. ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.